బడిలో సమస్యలెన్నో!

- మన్సూరాబాద్ ఎంపీపీ పాఠశాలపై పట్టింపు కరువు
- ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మన్సూరాబాద్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఏ ప్రభుత్వమైనా అధికారంలోకి వచ్చాక ప్రధానంగా ప్రజా సంక్షేమ పథకాలతో పాటు విద్య, వైద్యం, ఉద్యోగ కల్పనలపై దృష్టిసారించాలి. అలాంటిది కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అవన్నీ కుంటుపడుతున్నాయన్న ఆరోపణలు ప్రజల నుంచి విపరీతంగా వస్తున్నాయి. ఇందులో భాగంగా ప్రధానంగా రేపటి దేశ భవిష్యత్తులో కీలకంగా వ్యవహరించనున్న విద్యార్థులకు మాత్రం కొన్ని చోట్ల తమ తమ పాఠశాలల్లో సరైన సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తోంది. ముఖ్యంగా మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నెలకొన్న సమస్యలతో విద్యార్థులే కాదు ఉపాధ్యాయులు కూడా ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది. ఈ పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యానికి తగ్గట్టుగా ఉపాధ్యాయులు, తరగతి గదులు లేకపోవడం, ఒకే చోట బాలబాలికలకు టాయిలెట్స్ ఉండటం, ప్రధానంగా పాఠశాల ప్రహరీ కూలిపోయినా నేటికీ నిర్మించకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి.

ప్రహరీ లేక భద్రత కరువు

మన్సూరాబాద్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు సంబంధించిన ప్రహరీ కూలిపోయి నెలలు గడుస్తున్నా పట్టించుకునే నాథుడు లేకపోవడంతో పాఠశాల భద్రతపై ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు


పాఠశాలలోని సర్వశిక్ష అభియాన్(ఎడమ), టాయిలెట్స్(కుడి)

ఆందోళన చెందుతున్నారు. పాఠశాల పక్కనే ఉండే స్థల యజమాని కూలిపోయిన ప్రహరీకి ఆనుకుని కొంచెం కూడా సందు విడవకుండా డాబా ఏర్పాటు చేయడంతో అది ఎప్పుడు ఏ క్షణాన పాఠశాల వైపు ఒరిగి ప్రాణాలకు ముప్పు తెస్తుందోనన్న భయాందోళన నెలకొంది. విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధి దృష్టికి తీసుకెళ్లడంతో ప్రహరీ ఏర్పాటుకు చొరవ చూపినా పనులు ఎందుకు ముందుకు సాగడంలేదో తెలియడం లేదని పలువురు స్థానికులు పేర్కొంటున్నారు. విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని వెంటనే ప్రహరీని చాలా పటిష్టంగా నిర్మించాలని స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉపాధ్యాయులు ముగ్గురే..

ఒకటి నుంచి ఐదో తరగతి వరకు కొనసాగుతున్న ఈ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మొత్తం 102మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యాశాఖ నిబంధన ప్రకారం ప్రతి 90 మంది విద్యార్థులకు నలుగురేసి ఉపాధ్యాయులు ఉండాలి. కానీ 102 మంది విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలితో కలిపి కేవలం ముగ్గురు మాత్రమే ఉపాధ్యాయులు ఉన్నారు. దీంతో విద్యార్థులకు చదువు చెప్పడంలో తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం తమ పిల్లలకు సరైన సమయంలో సిలబస్ పూర్తి అవుతుందో.. కాదో.. అన్న భయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఉన్న ముగ్గురు ఉపాధ్యాయులతో పాటు మరో ఉపాధ్యాయుడిని కేటాయించాలని వారు కోరుతున్నారు.

ఐదు తరగతులకు గదులు మూడే..

పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు మొత్తం ఐదు తరగతులకు గాను మూడు తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. ఒక్కోసారి మూడేసి తరగతులను ఒకేచోట కలిపి చదువు చెప్పాల్సిన దుస్థితి నెలకొంటోంది. దీంతో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల భవనంలో కింద మూడు, పైన ఒక గది చొప్పున నాలుగు గదులు ఉండగా ఒక గదిని సర్వశిక్ష అభియాన్‌కు కేటాయించగా మిగిలిన మూడు గదుల్లో ఐదు తరగతులు కొనసాగుతుండటం గమనార్హం. పైన మరో గదిని నిర్మించడంతో పాటు సర్వశిక్ష అభియాన్ కేంద్రంను మరోచోటుకి తరలిస్తే విద్యార్థులకు గదుల కొరత లేకుండా పోతుందన్నది విద్యార్థుల తల్లిదండ్రుల వాదన.


సమస్యల వలయంలోని మన్సూరాబాద్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

బాలబాలికలందరికీ ఒకే చోట టాయిలెట్స్..

పాఠశాలలోని విద్యార్థులందరికీ(బాలురు, బాలికలు) ఒకే చోట టాయిలెట్స్ ఉన్నాయి. దీంతో విద్యార్థులు మూత్రశాలకు వెళ్లడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాలబాలికలకు వేర్వేరుగా టాయిలెట్స్ కేటాయిస్తే ఇబ్బందులు ఉండవని పలువురు పేర్కొంటున్నారు.

మన ఊరు-మన బడి నుంచి తొలగింపు!

గత ప్రభుత్వం విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని నిర్ణయించి ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించాలన్న ఉద్దేశంతో 'మన ఊరు-మన బడి' కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా మన్సూరాబాద్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఈ పథకానికి ఎంపిక చేసి నిర్ణయించగా ప్రస్తుత ప్రభుత్వం ఈ పథకం నుంచి పాఠశాలను తొలగించింది. దీంతో ఈ పాఠశాల అభివృద్ధి జరిగేది ఎన్నడో అని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

'మన ఊరు-మన బడి'కి ఎంపిక చేయాలి



పాఠశాల ప్రహరీ కూలిపోయి అభద్రత నెలకొంది. వెంటనే ప్రహరీని నిర్మించాలని కోరుతున్నా. అదేవిధంగా విద్యార్థుల సామర్థ్యాన్ని బట్టి నలుగురు ఉపాధ్యాయులు ఉండాలి. కానీ ముగ్గురమే ఉన్నాం. ఉపాధ్యాయుడిని కేటాయిస్తామని అధికారులు చెప్పారు. వెంటనే మరో ఉపాధ్యాయుడిని కేటాయిస్తారని ఆశిస్తున్నాం. మన ఊరు-మన బడి పథకానికి తమ పాఠశాలను ఎంపిక చేసి అన్ని విధాలా అభివృద్ధి చేస్తారని ఆశిస్తున్నాం.

- కవితారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు, ఎంపీపీ పాఠశాల


కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్‌తో కలిసి బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

రూ. 1.50కోట్లతో బీటీ రోడ్డు

మన్సూరాబాద్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ పరిధిలోని నాగోల్ పెట్రోల్ బంక్ నుంచి బండ్లగూడలోని ఆనంద్‌నగర్ తాజా టిఫిన్స్ వరకు రూ.కోటి50లక్షలతో నూతనంగా చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం స్థానిక కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్ యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో రోడ్డుపై నీరు నిల్వకుండా నాణ్యతాప్రమాణాలు పాటిస్తూ బీటీ రోడ్డు పనులు చేపట్టాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సాధ్యమైనంత తొందరగా పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్‌యాదవ్, అధికారులు డీఈ కనకయ్య, ఏఈ దీపక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చెరుకు ప్రశాంత్‌గౌడ్, అనంతుల రాజారెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, వివిధ పార్టీల నాయకులు మల్లేష్, రాజు, శ్రీనివాస్‌గౌడ్, రాధిక, రంగేశ్వరీ, సతీష్‌యాదవ్, శిల్పా, చంద్రశేఖర్ ఆజాద్, రంజిత్, శ్రీధర్ పాల్గొన్నారు.


తనిఖీలు నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

టాస్క్‌ఫోర్స్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

సైదాబాద్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సౌత్ ఈస్ట్‌జోన్ పరిధిలోని సైదాబాద్, మాదన్నపేట, ఐఎస్‌సదన్, డబీర్‌పురా పీఎస్ పరిధిలో మంగళవారం రాత్రి నగర సీపీ సివి ఆనంద్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. చంచల్‌గూడలోని శ్మశానవాటిక, ఫుట్‌పాత్‌లు, దుకాణాలు, రైల్వేస్టేషన్‌లలో తనిఖీలు నిర్వహించారు. అనుమానితులను క్షుణ్ణంగా పరిశీలించారు. రోడ్లపై మద్యం, గంజాయి సేవిస్తున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ తనిఖీలు టాస్క్‌ఫోర్స్ డీసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొనసాగాయి.

సరూర్‌నగర్ పాత పోస్టాఫీస్ రోడ్డును విస్తరించండి


జోనల్ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్ శ్రీవాణిఅంజన్

ఎల్బీనగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ రాకపోకలు విపరీతంగా పెరిగిన దృష్ట్యా సరూర్‌నగర్ పాత పోస్టాఫీస్ రహదారిని విస్తరించాలని సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ కోరారు. బుధవారం జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలిసిన కార్పొరేటర్ రోడ్డు విస్తరణపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాదాపు 15 సంవత్సరాలుగా సరూర్‌నగర్ పాత పోస్టాఫీస్ రోడ్డు విస్తరణ ప్రతిపాదన పెండింగ్‌లోనే ఉన్నదన్నారు. తక్షణమే రహదారి విస్తరణ చేపట్టాలని ఆమె కోరారు. దీంతో ట్రాఫిక్ ఇక్కట్లు తొలగిపోవడంతో పాటు ఇక్కడి ప్రజలు రాకపోకలు సాఫీగా సాగిస్తారన్నారు. సరూర్‌నగర్ ప్రజలకు రోడ్డు విస్తరణ ఎంతో మేలు చేస్తుందన్నారు.

డీహెచ్‌ఎల్ లాజిస్టిక్స్ వద్ద సెక్యూరిటీ గార్డుల నిరసన

- ఒప్పందం ప్రకారం రూ.17,500 ఇవ్వాలని డిమాండ్


డీహెచ్‌ఎల్ లాజిస్టిక్స్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సెక్యూరిటీ గార్డులు

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నగర శివారు తారామతిపేట గ్రామ పరిధిలోని డీహెచ్‌ఎల్ లాజిస్టిక్స్‌లో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డులు ఒప్పందం ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మూడు రోజులుగా నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. డీహెచ్‌ఎల్ లాజిస్టిక్స్ ప్రారంభించినప్పుడు ఎస్ఐఎస్ సెక్యూరిటీ ఏజెన్సీ ద్వారా సెక్యూరిటీ గార్డులకు నెలకు రూ. 17,500 వేతనం చొప్పున తీసుకున్నారు. కాగా గత ఆగస్టుతో ఆ ఏజెన్సీ అగ్రిమెంట్ ముగిసింది. దీంతో ఎంఎస్ఎఫ్ సెక్యూరిటీ ఏజెన్సీ ఆధ్వర్యంలో గార్డులు పని చేస్తున్నారు. అయితే గత సెక్యూరిటీ ఏజెన్సీ చెల్లించిన వేతనాలు అమలు చేయకుండా ఎంఎస్ఎఫ్ ఏజెన్సీ ఇబ్బందులకు గురి చేస్తోందని సెక్యూరిటీ గార్డులు ఆరోపిస్తున్నారు. సెక్యూరిటీ ఏజెన్సీ గార్డుల శ్రమను దోపిడీ చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకే నెలలో కిట్, ఇతర అలవెన్సుల పేరుతో నెల జీతంలో రూ. 10వేల కోత విధించారని తెలిపారు. గత ఏజెన్సీ చెల్లించిన విధంగానే రూ. 17,500 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటేష్, రాజు, మనీష్, దుర్గాప్రసాద్, సాయిరాం, నవీన్, పాండు, సిద్దేశ్వర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు వాటర్ ఫిల్టర్ వితరణ

హయత్‌నగర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ శ్రీశ్రీనగర్ కాలనీలోని ప్రభుత్వ పాథమిక పాఠశాలలో స్థానిక 22వ వార్డు కౌన్సిలర్ కొశిక ఐలయ్య సొంత ఖర్చులతో వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేయించారు. బుధవారం వాటర్ ఫిల్టర్‌ను ఐలయ్య ప్రారంభించి పాఠశాలకు అందించారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా షూలు, బెల్టులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ డీఈఈ భిక్షపతి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మహాలక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు తావునాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

కొహెడా ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు షూలు పంపిణీ

కొహెడా జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు గ్రామస్థులు మారగోని హరినాథ్‌గౌడ్, బద్దం జగన్‌మోహన్‌రెడ్డి, దాసర్లపల్లి మహేందర్‌రెడ్డిలు షూలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, మాజీ సర్పంచ్ సానెం అంజయ్య హాజరై విద్యార్థులకు అందజేశారు. భిక్షపతి, యూసుఫ్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు తిరుపతిబాయి, ఉపాధ్యాయులు దన్నె రాజు, లక్ష్మన్, కొండయ్య, రాధ, మధవి, చారి, విజయకుమారి, అమర్‌సింగ్, గణేష్, చంద్రమోహన్, యాదయ్య సాగర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సగౌర చేయూత

సైదాబాద్ : మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు సగౌర చారిటబుల్ సొసైటీ చేయూతనందించింది. మండల పరిధిలో ఉన్న 16పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 760మంది విద్యార్థులకు సంబంధించి పరీక్ష ఫీజు రూ.90వేల చెక్కును సొసైటీ ప్రెసిడెంట్ సత్యనారాయణ, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జిపి రావు బుధవారం మలక్‌పేట పాఠశాలలో ఉపవిద్యాశాఖాధికారి రాధాకృష్ణకు అందజేశారు. పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మందడి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ సాంబశివరావు, జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు అంజనేశ్వర్‌రావు, వెంకట్‌రెడ్డి, నిర్మల పాల్గొన్నారు.

రేపు కార్తీక పౌర్ణమి మహోత్సవం: ఈఓ

చంపాపేట : చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో ఈనెల 15న కార్తీక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ ఎస్.లావణ్య తెలిపారు. ఆలయంలో ఉదయం 6:30గంటలకు స్వామి వారికి సింధూర అభిషేకం, సాయంత్రం 6గంటల నుంచి 8గంటల వరకు సామూహిక కార్తీక దీపోత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో కార్తీక దీపోత్సవంలో పాల్గొనాలని, పాల్గొన్న మహిళలకు తాంబులం, స్వామి వారి ప్రసాదాలను అందజేయనున్నట్లు ఈఓ తెలిపారు.

వైభవంగా తులసీ కల్యాణం

మన్సూరాబాద్ : మన్సూరాబాద్ డివిజన్ విజయశ్రీకాలనీలోని పద్మావతి గోదాసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా బుధవారం సాయంత్రం తులసీ కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలో ఆలయ కమిటీ, విజయశ్రీకాలనీ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

- హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ చకోలేకర్ లక్ష్మి


మార్కెట్‌లో కొలువుదీరిన నూతన పాలక మండలి చైర్మన్, సభ్యులు

ఓల్డ్‌మలక్‌పేట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్‌లో దళారి వ్యవస్థను రూపుమాపి రైతుల సంక్షేమమే ధ్యేయంగా పాలకమండలి పనిచేస్తుందని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్‌పర్సన్ చకోలేకర్ లక్ష్మి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు నూతన పాలకమండలిని ప్రకటించింది. బుధవారం మలక్‌పేటలోని వ్యవసాయ మార్కెట్‌లో చైర్మన్, పాలక మండలి సభ్యులు పదవి బాధ్యతలు చేపట్టారు. మార్కెట్ సెలక్షన్‌గ్రేడ్ సెక్రెటరీ దామోదర్ ప్రభుత్వం నుంచి వచ్చిన ఉత్తర్వుల ప్రకారం చైర్మన్, పాలక మండలి సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన చైర్‌పర్సన్ లక్ష్మి మాట్లాడుతూ తనను చైర్మన్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, తన నియామకానికి సహకరించిన మంత్రి మండలికి, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్‌కు రైతులు తెచ్చిన పంటకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా పాలకమండలి కృషి చేస్తుందన్నారు. మార్కెట్ ఉద్యోగులు, పాలకమండలి సమన్వయంతో పనిచేసి హైదరాబాద్ మార్కెట్‌ను రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉంచుతామని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కోట్ల శ్రీనివాస్, పాలకమండలి సభ్యులు మాట్లాడారు. నూతన పాలక మండలిని మార్కెట్ ఉద్యోగులు, పలువురు నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చకొలేకర్ శ్రీనివాస్, మార్కెట్ పాలక మండలి సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాలకవర్గం వీరే..

రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ 9వ నూతన పాలక వర్గాన్ని ప్రకటించింది. చైర్మన్‌గా చెకొలేకర్ లక్ష్మి, వైస్‌చైర్మగా కోట్ల శ్రీనివాస్, పాలక మం డలి సభ్యులుగా నెలపాటి రామారావు, పన్నాల రాజేందర్‌రెడ్డి, ఎండి షకీల్, ఎస్‌యు ప్రత్యూష, బుద్దా సత్యనారాయణ, ఎం సాయిరాం, మస్రత్‌సుల్తానా, పాషం అశోక్‌గౌడ్, కంకలి శివాజీ, పి కిషన్‌సింగ్, డి జగదీష్, ఎం. క్రిష్ణ, గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, డీసీసీబీ అధ్యక్షుడు, మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ, హార్టికల్చర్ శాఖ ఉపసంచాలకులున్నారు. చైర్మన్‌తో సహ మొత్తం 18 మందికి పాలకవర్గంలో చోటు కల్పించారు.


మధుయాష్కీగౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలుపుతున్న నేలపాటి రామారావు

డైరెక్టర్‌గా నేలపాటి రామారావు

వనస్థలిపురం : హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా వనస్థలిపురం డివిజన్ ప్రశాంత్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నేలపాటి రామారావు నియమితులయ్యారు. తన నియామకానికి కృషి చేసిన టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్‌ను బుధవారం రామారావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు రావడం సంతోషకరం అన్నారు. రైతులు పండించిన పంటకు తగిన గిట్టుబాటు ధర రావడం కోసం తన వంతుగా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. రామారావుకు పార్టీ నాయకులు, పలువురు కాలనీ వాసులు, అభిమానులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

రైతుపక్షపాతి సీఎం రేవంత్‌రెడ్డి

చాదర్‌ఘాట్ : రాష్ట్రంలో రైతుల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం పనిచేస్తూ రైతు పక్షపాతిగా గుర్తింపు పొందారని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చెకోలేకర్ లక్ష్మీ అన్నారు. బుధవారం ఆమె టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చెకొలేకర్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, డైరెక్టర్లు సాయిరాం, ప్రత్యూష, ఎండీ షకీల్‌తో సలీంనగర్‌లోని మహాగణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత మధుయాష్కీగౌడ్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పదవి అప్పగించడం తన బాధ్యతను మరింత పెంచిందన్నారు.

కులగణన సర్వే పత్రాలను భద్రపరచుకోవాలి

- సిబ్బందికి మేయర్ పారిజాతారెడ్డి సూచన

సరూర్‌నగర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కులగణన సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది సర్వేకు సంబంధించిన పత్రాలను జాగ్రత్తగా భద్రపరచుకోవాలని, ఒక్క పత్రం పోయినా శ్రమంతా వృథా అవుతుందని బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి సూచించారు. సర్వే పత్రాలు భద్రపరచుకునేందుకు గాను సిబ్బంది కోసం తెప్పించిన జ్యూట్ బ్యాగులను డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ పి.సరస్వతితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వే పత్రాలను ప్లాస్టిక్ బ్యాగుల్లో, ఇతర సాధారణ బ్యాగుల్లో పెట్టుకోవడం వల్ల సిబ్బందికి ఇబ్బందులు కలుగుతున్నట్టు గుర్తించి వారి కోసం జ్యూట్ బ్యాగులు తెప్పించినట్టు పేర్కొన్నారు. ప్రతి ఎన్యూమరేటర్ తమకు అందజేసిన సర్వే పత్రాలన్నింటినీ సదరు బ్యాగుల్లో భద్రపరచుకోవాలని, సర్వేకు సంబంధించిన డేటాను కంప్యూటరీకరించేంత వరకు పత్రాలు జాగ్రత్తగా పెట్టుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


సర్వే సిబ్బందికి జ్యూట్ బ్యాగులు పంపిణీ చేస్తున్న మేయర్ పారిజాతారెడ్డి, డిప్యూటీ మేయర్ శేఖర్, కమిషనర్ సరస్వతి

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

బాలాపూర్ 17వ డివిజన్‌లోని పాత గ్రామంలో, హరిజనబస్తీలో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి బుధవారం మేయర్ పారిజాతానర్సింహారెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాంశేఖర్, కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, డీఈఈ నర్సింహరాజు, నాయకులు జైహింద్‌కుమార్, సుధాకర్‌రెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

కాళోజీకి ఘన నివాళి

వనస్థలిపురం : పుట్టుక నీది, చావు నీది, బతుకంతా దేశానిదని చాటి చెప్పిన ప్రజా కవి కాళోజీ నారాయణ ఆశయ సాధనకు కృషి చేయాలని మా భూమి సాంస్కృతిక చైతన్య వేదిక ప్రతినిధులు పేర్కొన్నారు. బుధవారం వనస్థలిపురంలోని వాసవీ నిలయంలో మా భూమి సాంస్కృతిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో ప్రజాకవి కాళోజీ నారాయణ రావు వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించి ఆయన సేవలను కొనియాడారు. నర్సింహ ప్రసాద్, ఉదయ్ శంకర్, నాగిరెడ్డి, రఘునందన్, శరణ్య, పద్మలత, విజయ్‌కుమార్, పవన్ పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న మా భూమి సాంస్కృతిక చైతన్య వేదిక సభ్యులు

మధుమేహంపై జాగ్రత్త వహించాలి : సందీప్‌రెడ్డి

మన్సూరాబాద్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో చిన్న, పెద్ద తేడా లేకుండా చాలా మందికి మధుమేహం సోకుతుందని, ఈ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని కామినేని ఆస్పత్రి డయాబెటాలజిస్ట్ డాక్టర్ సందీప్‌రెడ్డి తెలిపారు. నేడు ప్రపంచ మధుమేహం దినోత్సవం సందర్భంగా బుధవారం ఆస్పత్రిలోని ఆడిటోరియంలో విలేకరుల సమావేశంలో డయాబెటిక్ ప్యాకేజీని ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ సందీప్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో 40-50 మధ్య వయస్కులకు మధుమేహం వచ్చేదని, ఆహారపు అలవాట్లలో మార్పుల కారణంగా ప్రస్తుతం 20-30 వయస్కులకు కూడా సోకుతుందన్నారు. ఫ్యామిలీ మెడిసిన్ కన్సల్టెంట్స్ డాక్టర్ సుధీర్, డాక్టర్ జేసీస్ పాల్గొన్నారు.

వనస్థలిపురం : షుగర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని నాసా హాస్పటల్ వైద్యులు కార్తీక్, నవీన్‌కుమార్, రాకేష్‌లు తెలిపారు. బుధవారం వనస్థలిపురం డివిజన్ చింతలకుంటలోని నాసా హాస్పటల్‌లో ప్రపంచ షుగర్ వ్యాధి రోజును పురస్కరించుకుని షుగర్ వ్యాధిగ్రస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ గతంలో వయస్సు పైబడిన వారు మాత్రమే షుగర్ వ్యాధి బారిన పడేవారన్నారు. కానీ నేడు వయస్సుతో సంబంధం లేకుండా షుగర్ వ్యాధి బారిన పడుతున్నారని తెలిపారు. ఆదిలోనే షుగర్ వ్యాధిని గుర్తించి అరికట్టాలని సూచించారు.



మాట్లాడుతున్న డయాబెటాలజిస్ట్ డాక్టర్ సందీప్‌రెడ్డి

రూ.16లక్షల విలువ గల హాష్ ఆయిల్ పట్టివేత

- మాజీ మావోయిస్టు సహా ఇద్దరు డ్రగ్ పెడ్లర్లు అరెస్టు
- పరారీలో మరో ముగ్గురు


పెడ్లర్స్ వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్న హాష్ ఆయిల్, సెల్‌ఫోన్లు

కొత్తపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్‌లో లా అండ్ ఆర్డర్ పోలీసులు, యాంటీ నార్కోటిక్ పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో రూ.16 లక్షల విలువ చేసే 3కేజీల 319గ్రాముల హాష్ ఆయిల్‌ను పట్టుకున్నారు. ఈ నార్కోటిక్ కేసులో ప్రధాన నిందితుడైన మాజీ మావోయిస్టు సహా ఇద్దరు డ్రగ్ పెడ్లర్‌లను అరెస్టు చేశారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు. ఎల్బీనగర్ ఎస్‌హెచ్ఓ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం రావులపల్లి జమదంగికి చెందిన వంతల నారాయణ(24), వంతల రమేష్(19), అర్జున్(19) స్నేహితులు. సులభంగా డబ్బు సంపాదించాలని ముగ్గురూ డ్రగ్ పెడ్లర్లుగా మారారు. విశాఖపట్నం జమదంగికి చెందిన శివ, కొండమల్లుకు చెందిన కిషోర్‌ల వద్ద వారు 3 కేజీల 319గ్రాముల హాష్ ఆయిల్‌ను ప్లాస్టిక్ కవర్స్‌లో తీసుకుని మంగళవారం ఎల్బీనగర్‌కు వచ్చారు. రాహుల్ అనే వ్యక్తికి అందజేసేందుకు నార్సింగ్ మాల్, మాల్‌మైసమ్మ ఫ్లైఓవర్ వద్ద ముగ్గురూ స్టూడెంట్ బ్యాక్‌ప్యాక్ బ్యాగులతో వేచి ఉన్నారు. విషయం తెలుసుకున్న యాంటీ నార్కోటిక్ పోలీసులు, లాఅండ్ ఆర్డర్ పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. విచారణ అనంతరం మూడు హాష్ ఆయిల్ ఉన్న ప్లాస్టిక్ బ్యాగులను, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నేరం అంగీకరించడంతో ముగ్గురిని బుధవారం రిమాండుకు తరలించారు.

ప్రధాన నిందితుడు మాజీ మావోయిస్టు

ప్రధాన నిందితుడు వంతల నారాయణ అలియాస్ సిద్దు మాజీ మావోయిస్టు. 2015లో అతడు విశాఖపట్నం పెదబాయలు మావోయిస్టు దళంలో సహాయకుడిగా చేరాడు. 2020వరకు అతడు మావోయిస్టు కార్యకలాపాల్లో పాల్గొన్నాడు. 2021లో అతడు మావోయిస్టు స్నేహితులు విష్ణు, శ్రీనులతో కలిసి విశాఖపట్నం డీఎస్పీ ఎదుట లొంగిపోయాడు. అతడిపై 10 కేసులు ఉన్నట్లు సమాచారం.

దళితుల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం

- డీహెచ్‌పీఎస్ రాష్ట్ర నేత అనిల్ ధ్వజం

సరూర్‌నగర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): దళితుల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ ధ్వజమెత్తారు. పోరాటాల ద్వారా మాత్రమే దళితులు తమ హక్కులను సాధించుకోగలుగుతారని, ఆ దిశలో దళితులంతా ఏకం కావాల్సిన అవసరం ఉన్నదని ఆయన అన్నారు. బుధవారం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని ఇందిరానగర్‌లో ఏర్పాటు చేసిన డీహెచ్‌పీఎస్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సమాజంలో నేటికీ అంటరానితనం, కులవివక్ష కొనసాగుతున్నాయంటే దానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణమని అన్నారు. సీపీఐ రాష్ట్ర నాయకుడు రవీంద్రాచారి మాట్లాడుతూ కులవివక్ష నిర్మూలన, హక్కుల సాధన లక్ష్యంగా దళితులు ఉద్యమించాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు దాసరి మల్లేశ్, సహాయ కార్యదర్శి నారాయణ, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, బాలాపూర్ మండల కార్యదర్శి ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు రామస్వామి, శివనాయక్, యాదమ్మయాదవ్, వీరస్వామి, రవి, చిట్టి, మహేశ్, సనా పాల్గొన్నారు.